సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 14 । జులై । 2025



సాగు లాభదాయకం

వరి సాగులో అధిక దిగుబడి సాధించేందుకు ఆరోగ్యవంతమైన నారు కీలకం. మంచి నారుకోసం నారుమడి తయారీ నుంచి ఎంతో జాగ్రత్త అవసరం. 8లో



చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొనడంతో 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన చింతలపూడి మండలం, వెలగలపల్లి ఊరచెరువు సమీపంలో చోటుచేసుకుంది. 8లో



పశువుల ప్రాణాలకే ముప్పు

వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సంభవించే అవకాశముందని, తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పశువుల ప్రాణాలకే ముప్పని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

హారికను పరామర్శించిన మండలి చైర్మన్



జెడ్పీ చైర్‌పర్సన్ హారికను పరామర్శిస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు

భీమవరం: టీడీపీ, జనసేన మూకల దాడికి గురైన కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆదివారం పరామర్శించారు. శనివారం పెడనలోని హారిక గృహానికి వెళ్లిన దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అడ్వకేట్ సుబ్బారాయుడుకి ప్రశంసలు



అడపా వెంకట సుబ్బారాయుడు, అడ్వకేట్

పెనుగొండ: పెనుగొండకు చెందిన అడ్వకేట్ అడపా వెంకట సుబ్బారాయుడు, మరో రచయితతో కలసి రచించిన ౹రూబ్రిక్స్ ఆఫ్ కాంట్రాక్ట్స్ పుస్తకానికి ప్రశంసలు దక్కాయి. నల్సార్ వర్శిటీ స్నాతకోత్సవంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ పాల్, సుప్రీంకోర్టు జస్టిస్ పీఎస్ నరసింహ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత అడపా వెంకట సుబ్బారాయుడును పలువురు ప్రశంసించారు. సుబ్బారాయుడు పెనుగొండకు చెందిన హైకోర్టు న్యాయవాది ఇండుగపల్లి రామానుజరావు కుమారుడు.

నరసాపురం లేసుకు మరో గుర్తింపు

భీమవరం (ప్రకాశంచౌక్): నరసాపురం లేసుకు మరో అరుదైన గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వ ×ఒక జిల్లా– ఒక ఉత్పత్తి౯ కింద 2024–25 ఏడాదికి ఎంపికైంది. రాష్ట్రం నుంచి 26 జిల్లాల ఉత్పత్తులు పోటీ పడగా.. క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపికయ్యాయి. వాటిలో లేసు అల్లికలు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణం. ఈ పురస్కారాన్ని అందుకొనేందుకు కలెక్టర్ చదలవాడ నాగరాణి ఢిల్లీ వెళ్లారు. ప్రగతి మైదానం సోమవారం జరిగే కార్యక్రమంలో అవార్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖల మంత్రి చేతుల మీదుగా అందుకుంటారు. లేసు అల్లికలకు గత కొద్ది నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. ఈ అవార్డును కలెక్టర్ నాగరాణి ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను ఈ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆలస్యంగా విద్యార్థినులకు భోజనంపై ఆగ్రహం

నూజివీడు: పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ల బాధ్యత రాహిత్యం కారణంగా విద్యార్థినులు ఆదివారం ఆకలితో అలమటించారు. మధ్యాహ్నం 12.30 గంటల కల్లా భోజనం పెట్టాల్సి ఉండగా రెండు గంటల వరకు పెట్టలేదు. ప్రిన్సిపాల్ బాధ్యతలను వైస్ ప్రిన్సిపాల్ కు అప్పగించి వెళ్లగా, వైస్ ప్రిన్సిపాల్ మరొక టీచర్ కు బాధ్యతలను అప్పగించారు. 600 మంది విద్యార్థినులు ఉండగా ఆదివారం కావడంతో పిల్లలను కలుసుకునేందుకు వచ్చిన తల్లిదండ్రులను లోపలికి అనుమతించలేదు. రెండు గంటలవుతున్నా భోజనం పెట్టకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తల్లిదండ్రులు గొడవ చేయడంతో చివరికి రెండు గంటల తరువాత భోజనం పెట్టారు. కొందరు తల్లిదండ్రులు తహసీల్దార్‌కు సమాచారం అందించడంతో ఆయన వీఆర్వోలను గురుకుల పాఠశాల వద్దకు పంపించారు. సెలవు రోజులు వస్తే ఇలాంటి ఇబ్బందులు తరచూ ఎదురవుతున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



వేలేరుపాడు మండలం ఎద్దెలవాగు వంతెన వద్ద నాటు పడవపై ప్రయాణిస్తున్న గిరిజనులు

ఉధృతంగానే గోదావరి

- భద్రాచలం వద్ద శాంతించినా ఉమ్మడి జిల్లాలో తగ్గని వరద పోటు
- పోలవరం ప్రాజెక్టు నుంచి 7.19 లక్షల క్యూసెక్కులు విడుదల
- సిద్ధాంతం ఒడ్డున పడవల రాకపోకలు నిలిపివేత
- ముంపులో కనకాయలంక కాజ్‌వే

వేలేరుపాడు/ పోలవరం రూరల్/ పెనుగొండ/ యలమంచిలి : భద్రాచలం వద్ద గోదావరి శాంతించినా దిగువన వరద పోటు కొనసాగుతోంది. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో ఎద్దెలవాగు వంతెన ఇంకా నీటమునిగే ఉంది. దీంతో వేలేరుపాడు మండలంలో 18 గిరిజన గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. ఆదివారం ఉదయం భద్రాచలం వద్ద 33.50 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటలకు 30.20 అడుగులకు తగ్గింది. అయినా వేలేరుపాడు మండలంలో దిగువనున్న కొయిదా, కాచారం, టేకుపల్లి, పేరంటపల్లి, కట్కూరు, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, బుర్రెడ్డిగూడెం, సిద్ధారం, కుంకుడు కొయ్యల పాకలు, మరో ఏడు గిరిజన గ్రామాలు జలదిగ్బంధనంలో ఉన్నాయి. దీంతో అధికారులు ఎద్దెలవాగు వంతెన వద్ద నాటు పడవ ఏర్పాటు చేశారు.



యలమంచిలి మండలం కనకాయలంక వద్ద వరద నీటిలో కాజ్‌వేపై రాకపోకలు

ముంపులో కనకాయలంక కాజ్‌వే

యలమంచిలి: యలమంచిలి మండలంలో గోదావరిలో వరద ఉధృతి పెరగడంతో కనకాయలంక కాజ్‌వే ఆదివారం నీట మునిగింది. దీంతో కనకాయలంక ప్రజలు అడుగున్నర లోతు వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. వరదనీరు ఇంకా పెరిగితే పెరిగితే పడవలు ఏర్పాటు చేస్తామని వీఆర్వో ఘనలక్ష్మి తెలిపారు. అయితే భద్రాచలం వద్ద వరద ఆదివారం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో సోమవారం ఉదయం వరకు కాజ్‌వేపై వరదనీటి ప్రవాహం కొనసాగే అవకాశం ఉంది. వరద ఉధృతిలో ఉన్న కనకాయలంక కాజ్‌వేను నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్‌లు పరిశీలించి, స్థానిక అధికారులకు సహాయ చర్యలపై సూచనలిచ్చారు.



పెనుగొండ మండలం సిద్ధాంతం కేదారీఘాట్‌లో నీట మునిగిన శివలింగం



సిద్ధాంతంలో ఒడ్డున నిలిపేసిన పడవలు

భద్రాచలం వద్ద 30.20 అడుగులకు

పోలవరం మండలంలో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. **పోలవరం** ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద **ఆదివారం రాత్రికి** స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 7.19 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద కూడా నీటి మట్టం 30.20 అడుగులకు చేరుకుంది. క్రమేపీ వరద ప్రవాహం తగ్గుతోంది. ఆదివారం ఉదయానికి స్పిల్‌వే నుంచి 7.63 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తుండగా.. రాత్రికి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు తగ్గుతుండటంతో వరద ఉధృతి తగ్గింది. భద్రాచలం వద్ద 36.60 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ ఆదివారం రాత్రికి 30.20 అడుగులకు చేరింది.

సిద్ధాంతంలో ఉధృతంగా..

పెనుగొండ మండలంలో గోదావరికి వరద ఉధృతి మరింత పెరిగింది. దీంతో ఏటిగట్టు పొడవున లంక భూములను తాకుతూ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. సిద్ధాంతం మధ్యస్థ లంకకు నీటి మట్టం చేరుకోవడంతో పడవల రాకపోకలపై నియంత్రణ విధించారు. గోదావరిలో వెళ్లవద్దంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సిద్ధాంతంలో పడవలను ఒడ్డుకు చేర్చారు. కేదారీఘాటలోని పుష్కర రేవులో ప్రతిష్ఠించిన లింగం గోదావరి వరద నీటిలో మునిగింది. ఘాట్‌లో మూడు పుష్కర రేవుల్లోకి వరద నీరు ఉధృతంగా రావడంతో పై మెట్ల వరకూ నీటి మట్టం చేరుకుంది. ఆచంట మండలంలో కోడేరులో పుష్కర ఘాట్ వరకూ వరద నీరు చేరింది. మరింత ఉధృతి వస్తే తప్ప ఆచంట మండలంలోని లంక గ్రామాలకు ఎలాంటి ముప్పులేదని అధికారులు తెలిపారు. మరింత ఉధృతి పెరిగితే సురక్షిత ప్రాంతాలకు ప్రజలు చేరుకోవాలని సూచించారు.

బూటకపు హామీలతో మోసగించారు

తణుకు అర్బన్: ఎన్నికల ముందు బూటకపు హామీలిచ్చి ఇంటింటికీ మేనిఫెస్టో బాండ్లు పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని నమ్మించి మోసం చేసిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. తణుకు మండలం మండపాక గ్రామంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు వెన్నుపోటు, మోసం చేయడంలో నిష్ణాతుడని తెలిసినప్పటికీ మరోసారి నమ్మి మోసపోయామని ప్రజానీకం ఆవేదన చెందుతున్నార ని అన్నారు. ఏ గుమ్మంలోకి వెళ్లినా గతంలో వలంటీర్లు ఇంటిగడపలోకి వచ్చి పనులు చేసేవారని, రేషన్ ఇంటి గుమ్మంలోకి వచ్చేదని నేడు కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు చేయడంలేదని చెబుతున్నారని, ప్రజల కష్టాలు వర్ణనాతీతమని స్పష్టం చేశారు. హామీలు అమలుచేయరా అని నిలదీస్తుంటే దాడులు, హత్యలు, విధ్వంసానికి దిగుతున్నారన్నారు. శ్రీకాళహస్తిలో జనసేన ఇన్‌చార్జ్ డ్రైవర్‌ను చిత్రహింసలకు గురిచేసి హత్యచేశారని, గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్‌పై టీడీపీ గూండాలు దాడికి దిగి సభ్యసమాజం తలదించుకునేలా దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారని ఏరోజు ఏ ప్రాంతంలో ఏ దాడులు జరుగుతాయో, ఏ మారణకాండ సృష్టిస్తారోనని ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారని మండిపడ్డారు. పరిపాలన అంతా దాచుకో దోచుకో అనే రీతిలో ఇష్టానుసారంగా దోచేసుకుంటున్నారని, తాడేపల్లి కేంద్రంగా కూటమి ప్రభుత్వం భారీ దోపిడీకి తెరతీసి ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తుందని అన్నారు. కల్తీ మద్యం విక్రయాలు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. అనంతరం మండపాక గ్రామంలో ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను అందచేశారు. ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నాయకులు ముళ్లపూడి బాబూరావు, బద్దే ప్రవీణ్, జువ్వల వెంకట్రావు, ఉండవల్లి సుందర రావు, ఉండవల్లి సురేష్, మరిశెట్టి రామకృష్ణ, మద్దల రవికాంత్, పమ్మి విజయశేఖర్, సరెళ్ల క్రాంతి, పాలపర్తి అఖిల్, మొంటెయి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



మండపాకలో క్యూఆర్ కోడ్ కరపత్రం అందిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, ఉండవల్లి జానకి

మహిళలకు రక్షణ కరువు



గూడూరి ఉమాబాల

భీమవరం: కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని వరుస ఘటనలతో మహిళలు, యువత, బాలికలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్ల పాలనలో మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేసి అండగా నిలిస్తే నేడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మహిళలపై అఘాయిత్యాలు, హత్యాచారాలు, దాడులు, హత్యలు పెచ్చుమీరిపోయాయన్నారు. జగన్ ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి పెద్దన్నగా అండగా నిలిచారని ఐదేళ్ల పాటు మహిళలు సుఖ, సంతోషాలతో జీవనం సాగిస్తే నేడు దినదిన గండంగా జీవనం సాగించాల్సి వస్తుందని ఉమాబాల వాపోయారు. కాకినాడ జీజీహెచ్ పారామెడికల్ విద్యార్థుల వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడితే ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని దుయ్యబట్టారు. కృష్ణా జెడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారికపై దాడి సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి మహిళలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని ఇలంటి వాటికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

పునరావాస కార్యక్రమాల పరిశీలన

వేలేరుపాడు: కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలకు దాచారంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలోను, తాడువాయి, ములగలంపల్లిలలో ఏర్పాటుచేసిన వరద పునరావాస శిబిరాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలను అధికారులు దగ్గరుండి పరిశీలించారు. ఆదివారం ఉదయం రేపాకగొమ్ము గ్రామంలోని కొన్ని కుటుంబాలను తాడువాయి, ములగలంపల్లిలో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాలకు తరలించే పనులను ఆర్డీఓ పర్యవేక్షించారు. దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ఏర్పాటుచేసిన శిబిరాలలో ప్రజలకు భోజన తయారీని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ దగ్గరుండి పరిశీలించి, ప్రజలకు వడ్డించారు.

చోరీ ఫోన్ల రికవరీలో జాప్యం

- జిల్లాలో మొత్తం 4,990 ఫిర్యాదులు
- వేరే రాష్ట్రాల్లో వాడుతున్న ఫోన్లను ట్రాక్ చేయడంలో భాషతో ఇబ్బంది

భీమవరం : మీ ఫోన్ పోగొట్టుకున్నారా? అయితే మీ ఫోన్‌కు సంబంధించిన వివరాలు పంపితే చాలు పోగొట్టుకున్న మీ మొబైల్‌ను రికవరీ చేసి మీకు అందిస్తామని పోలీసు శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. ఖరీదైన ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు ఎంతో ఆశతో సెల్ ట్రాకింగ్‌కు ఫిర్యాదు చేస్తున్నా.. మీ ఫోన్ రికవరీ చేయలేకపోతున్నామని పోలీసులు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం భాష ఇబ్బంది. ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా అపహరణకు గురైన ఫోన్ ఇతర రాష్ట్రాల్లో వినియోగిస్తున్నట్లు ఫోన్ సిగ్నల్స్ ద్వారా పోలీసులు గుర్తించినా.. అక్కడి పోలీసులతో మాట్లాడడానికి భాష ఇబ్బందిగా మారింది. దీంతో ఎక్కువ ఫోన్లను రికవరీ చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. సెల్ ట్రాకింగ్ సిస్టమ్‌లో ఇతర భాషలపై అనుభవం ఉన్న సిబ్బంది లేకపోవడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఇతర భాషలు తెలిసిన పోలీసు సిబ్బందిని నియమిస్తే ఎక్కువ ఫోన్లు రికవరీ చేసే అవకాశముంటుందని పోలీసులు చెబుతున్నారు.

జిల్లాలో 4,990 ఫిర్యాదులు

జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, కూడళ్ల వద్ద నిత్యం సెల్‌ఫోన్ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పెద్ద సంఖ్యలో సెల్‌ఫోన్లు అపహరణకు గురవుతున్నా పోలీసులకు ఫిర్యాదు చేసేది కొద్దిమంది మాత్రమే. ఫిర్యాదు చేయాల్సి వస్తే.. ఫోన్ కొనుగోలు చేసిన రసీదులు చూపించడం, ఎక్కువ సార్లు పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాల్సి రావడంతో ఫోన్ పోయినా మిన్నకుండి పోతున్నారు. ఖరీదైన ఫోన్లు, కొత్త ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు మాత్రం తన ఫోన్ కోసం ఫిర్యాదు చేస్తున్నారు.



పోలీసులు రికవరీ చేసిన ఫోన్లు(ఫైల్)

రికవరీ చేసింది 1,612 మాత్రమే

జిల్లా వ్యాప్తంగా సెల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా పది విడతల్లో సుమారు రూ.2.40 కోట్ల విలువైన 1,612 సెల్‌ఫోన్లు మాత్రమే రికవరీ చేయగలిగారు. ఫిర్యాదు అందిన సెల్ ఫోన్లు వాడుతూ ఉంటే అవి ఎక్కడ వినియోగిస్తున్నారో సెల్ ట్రాకింగ్ ద్వారా గుర్తించి ఆయా ప్రాంతాల్లోని పోలీసుల సహకారంతో వాటిని రికవరీ చేస్తుంటారు. పట్టుబడ్డ ఫోన్లు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వినియోగిస్తున్న వాటిని పోలీసులు రికవరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది సెల్ ఫోన్లు దొంగించే ముఠా సభ్యులు ఇక్కడ దొంగిలించిన ఫోన్‌లు కేరళ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. అక్కడ వాటిని కొంతమంది నేరుగా విక్రయిస్తుండగా మరికొంతమంది సెల్ ఫోన్ల విడిభాగాలుగా విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తీరంలో యథేచ్ఛగా తవ్వకాలు

- కూటమి నేతలకు కాసుల వర్షం
- నిబంధనలకు పాతర
- పట్టించుకోని అధికారులు

నరసాపురం రూరల్: నరసాపురం తీర ప్రాంత గ్రామాల్లోని మట్టి, బొండు ఇసుకతో పాటు సముద్ర పరీవాహక ప్రాంతంలోని ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఈ మట్టి దందాకు అధికారుల అండదండలు ఉండటంతో కూటమి నేతలకు కాసుల వర్షం కురుస్తోంది. యథేచ్ఛగా మట్టి, ఇసుక తవ్వకాలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల జరుగుతున్న అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లినవారిపై కేసులు నమోదు చేస్తామంటూ ఓ అధికారి బెదిరింపులకు దిగడం గమనార్హం.

నరసాపురం మండలం వేములదీవి, చినమైనవానిలంక, బియ్యపుతిప్ప ప్రాంతాల్లోని సీఆర్‌జెడ్, జిరాయితీ భూముల్లోని ఇసుకను కూటమి పార్టీల నాయకులు యథేచ్ఛగా భారీ యంత్రాలతో తవ్వి, లారీలు, ట్రాక్టర్లలో ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. నిబంధనల మేరకు సీఆర్‌జెడ్ భూముల్లో ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని అధికార పార్టీ నేతలు, మట్టి అమ్మకందారులు కుమ్మక్కై యథేచ్ఛగా ఇసుకను విక్రయిస్తున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి ఒకరు తన పంచాయతీ పరిధిని దాటి వేరొక పంచాయితీలో ఇసుక తవ్వకానికి పూనుకోవడంతో అక్కడివారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికార పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధినని తననే అడ్డుకుంటారా అంటూ దూషించినట్లు తెలిసింది. తప్పుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. నరసాపురం నియోజకవర్గంలో ఇలాంటి పాలన ఎప్పుడూ చూడలేదని అధికారులందరూ కూటమి నేతలకు తొత్తులుగా మారి వారికి అనుకూలంగా పనిచేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.



వేములదీవి తూర్పు గ్రామ పరిధిలో అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం



సొసైటీ కాలువ ద్వారా సముద్రపు పోటు నీరు వస్తున్నా ఆపకుండా తవ్వకాలు

చర్యలు తీసుకోవాలి



వేట, కూలి పని చేసుకుని జీవిస్తున్నాం. సొసైటీ భూముల్లోని ఇసుకను అక్రమంగా తవ్వి విక్రయిస్తుండటంతో మా వాళ్లంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసు వేధింపులు ఎక్కువయ్యాయి. ఉదయం, రాత్రి స్టేషన్‌కు వచ్చి పడిగాపులు పడాల్సివస్తుంది. ఇదే విధంగా తవ్వకాలు జరిగితే ఊర్లోకి సముద్రం చొచ్చుకు వచ్చి ముంపు బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సంగాని మార్రాజు, వేములదీవి తూర్పు

కలెక్టర్ దృష్టి సారించాలి



సీఆర్‌జెడ్, జీ రాయితీ భూముల్లోని ఇసుకను యథేచ్ఛగా తవ్వి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. నిబంధనలకు పాతరేసిన అధికారులపైనా చర్యలు చేపట్టాలి. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని కక్ష గట్టి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించుకుంటున్నారు. కలెక్టర్ దృష్టి సారించి మమ్మల్ని వేధిస్తున్న, అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న మాఫియాపై ఉక్కుపాదం మోపాలి.

– తిరుమాని రామారావు, వేములదీవి తూర్పు

అధికారుల అలసత్వం వల్లే జీతాలు ఆలస్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల బదిలీలు జరిగి నెలరోజులు కావస్తున్నప్పటికీ సీఎస్ఈ అధికారులు కేడర్ బలం నిర్ధారించి పొజిషన్ ఐడీలు కేటాయించడంలో అలసత్వం వహించడం వల్లనే బదిలీ పొందిన ఉపాధ్యాయులు ఇంత వరకూ జూన్ నెల జీతాలు పొందలేక పోయారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ళూరి రామారావు, బీ.రెడ్డిదొర ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు రాక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించటం వలన, రకరకాల ట్రైనింగ్‌ల వలన బోధన సమయం హరించుకుపోతోందని, ట్రైనింగ్‌లను కేవలం ఒక్క రోజు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పెద్దింట్లమ్మకు బోనాలు సమర్పించిన హిజ్రాలు



కొల్లేటికోట పెద్దింట్లమ్మకు బోనాలు, సారె సమర్పించిన హిజ్రాలు

కై కలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లిని తెలంగాణకు చెందిన హిజ్రాలు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు, సారెను సమర్పించారు. మేళతాళాలతో నృత్యాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజు పెద్దింట్లమ్మ అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.98,126 ఆదాయం వచ్చిందని తెలిపారు.

మావుళ్లమ్మకు సారె



మావుళ్లమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో వేంచేసి యున్న శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. రెస్ట్ హౌస్ రోడ్ కి చెందిన మిండీ ఈశ్వరరావు నాగ సుధ దంపతులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి సారెగా 50 రకాల పండ్లు, స్వీట్లు సమర్పించారు. అమ్మవారి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

జై వనరూపిణి



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కాపవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వాహనాలలో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

నారు కీలకం.. సాగు లాభదాయకం

- సార్వా సాగుకు రైతులు సన్నద్ధం
- నారు సస్యరక్షణ పనుల్లో బిజీ బిజీ



నారుమడిలో రసాయనాలు పిచికారీ చేస్తున్న రైతు



నారు తీస్తున్న కూలీలు

గణపవరం: వరి సాగులో ఖర్చులు తగ్గించుకొని, అధిగ దిగుబడి సాధించి వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవడానికి ఆరోగ్యవంతమైన నారు కీలకం. ఆరోగ్యకరమైన నారుకోసం నారుమడి తయారీ నుంచి ఎంతో జాగ్రత్త అవసరం. ప్రస్తుతం రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. నారుమడుల తయారీ, విత్తనాలు చల్లుకోవడం, నారు సస్యరక్షణ పనుల్లో బిజీగా ఉన్నారు. కొన్ని చోట్ల నాట్లుకూడా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నారుమడి తయారీ, సస్యరక్షణ చర్యల్లో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

నారుమడి తయారీలో పాటించాల్సిన జాగ్రత్తలు

నారుమడి వేయడానికి ఎంచుకున్న నేల పొలానికన్నా మెరకలో ఉండి, సారవంతమైనదిగా ఉండాలి. పొలాన్ని బాగా దుక్కిదున్ని కలుపు లేకుండా చూసుకోవాలి. వీలైనంత వరకూ బాగా చివికిన సేంద్రియ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. అందువల్ల వేరువ్యవస్థ వత్తుగా, బలంగా తయారై, నారు పీకేటప్పుడు తెగిపోకుండా ఉంటుంది. అంతేకాక మొక్కకు అన్నిరకాల పోషకాలు పుష్కలంగా అంది, మొక్క ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడుసార్లు దమ్ముచేసి, చదునుచేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.

విత్తడం

ఎకరా పొలంలో నాట్లు వేయడానికి 5 సెంట్ల నారుమడి సరిపోతుంది. 5 కిలోల విత్తనాలను ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బన్‌డిజం కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి, మొలకలు కట్టిన తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నారు ఆకు పూర్తిగా విచ్చుకునే వరకూ ఆరుతడులు ఇచ్చుకోవాలి. తర్వాత పలుచగా నీరు పెట్టాలి. మెట్ట నారుమడికి 3 గ్రాముల కార్బన్‌డిజం కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టిన తర్వాత చల్లుకోవాలి.

పోషక యాజమాన్యం

ఎకరా నారుమడికి 6 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేటు, 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో వేయాలి. రెండు కిలోల యూరియాను విత్తనాలు చల్లేముందు, ఒక కిలో యూరియా విత్తిన 10 రోజుల తర్వాత వేసుకోవాలి. దీనివలన నారు ధృఢంగా పెరుగుతుంది. నారు మడిలో ఇనుపధాతు లోపం కనిపిస్తే లేత చిగురాకులపై ఇటుకరంగు మచ్చలు ఏర్పడి, నారు నిర్జీవంగా మారి ఎదుగుదల ఉండదు. దీని నివారణకు లీటరు నీటిలో 20 గ్రాముల అన్నబేధి, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపిన ద్రావణం పిచికారీ చేసుకోవాలి.

కలుపు నివారణ

నారుమడిలో కలుపు మొక్కలు కనిపిస్తే సాధారణంగా చిన్న కమతాల నారుమడుల్లో కలుపును రైతులు లేదా కూలీలచేత తీయించి వేస్తారు. పెద్ద కమతాల రైతులు మాత్రం కలుపు నివారణకు రసాయనాలు ఉపయోగించవచ్చు. నారుమడిలో ఊద, ఇతర కలుపుజాతి మొక్కలు ఉంటే నివారణకు ఎకరా నారుమడికి 400 మి.లీ సైహలో ఫాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో ఊద, గడ్డిజాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి. నారుకు ఎలాంటి నష్టం ఉండదు.

కలుపు మందు వాడకంలో జాగ్రత్తలు

కలుపుమందు వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే నారుకు నష్టం కలుగుతుంది. సిఫార్సు చేసిన మందును, సిఫార్సు చేసిన మోతాదులో వాడాలి. లేకపోతే నారుకు నష్టం కలుగుతుంది. మందు పిచికారీ చేసిన తర్వాత రెండు రోజుల వరకూ నీరు పెట్టకూడదు. భూమి పొడిగా ఉన్నప్పుడు, ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు రసాయన మందులు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు రావు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరా నారుమడికి 160 గ్రాముల చొప్పున వేసుకోవాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిఫైరిఫాస్ 2.0 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేసుకోవాలి. నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడిలో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి చల్లుకోవాలి.

– ఆర్ఎస్ ప్రసాద్, ఏవో, గణపవరం

పారిజాతగిరిలో కల్యాణోత్సవం



విశేషాలంకరణలో దేవేరులతో శ్రీవారు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం శ్రవణా నక్షత్ర సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవం ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం, జంగారెడ్డిగూడెం, భీమడోలు, భీమవరం నుంచి వచ్చిన పలువురు దంపతులు కల్యాణ తంతులో ఉభయదారులుగా వ్యవహరించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన హరే శ్రీనివాస భజన మండలచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఏర్పాట్లను కార్యనిర్వాహణాధికారి కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతి రాజు, సభ్యులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

ఉండి: వ్యక్తిపై అత్యాచారయత్నం కేసు నమోదైంది. వివరాల ప్రకారం ఉండి గోరింతటలో 19 ఏళ్ల యువతి తన తల్లితో నివాసముంటుంది. పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే రాజేష్ హోటల్‌లో వంట చేసేందుకు మనిషి కావాలని అడిగేందుకు ఈ నెల 12న ఉదయం 7 గంటలకు యువతి వద్ద ఆమె తల్లి ఫోన్ నంబర్ తీసుకున్నాడు. ఆదివారం ఆమె తల్లి ఇంట్లో లేని సమయంలో యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడగా కేకలు వేయడంతో రాజేష్ పారిపోయాడు. దీనిపై యువతి ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

12 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు



వెలగలపల్లి ఊరచెరువు సమీపంలో చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



క్షతగాత్రులకు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు

చింతలపూడి: ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొని 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన చింతలపూడి మండలం, వెలగలపల్లి ఊరచెరువు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో సత్తుపల్లి నుంచి ఏలూరు వెళ్తుండగా వెలగలపల్లి ఊరచెరువు సమీపంలో డ్రైవర్ రోడ్డుపై ఉన్న భారీ గోతులను తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 12 మందికి స్వల్ప గాయాలు కాగా వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారిని వేరే బస్సులో తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ఉన్నారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా రోడ్డుపై పెద్ద, పెద్ద గోతులు ఉండటం వల్లనే స్టీరింగ్ కంట్రోల్ తప్పి చెట్టును ఢీకొట్టినట్లు బస్సు డ్రైవర్ నరశింహారావు తెలిపాడు. రహదారులకు కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేయకపోవడం కారణంగా నిరంతరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

కారు ఢీకొని ఆటో బోల్తా

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు



ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద కారు ఢీకొట్టడంతో రహదారిపై బోల్తాపడిన ఆటో

ద్వారకాతిరుమల: మండలంలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై ఆదివారం కారు ఢీకొట్టడంతో ఒక ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడెం కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ వంగలపూడి ప్రభాకరరావు, మహదేవపురంనకు చెందిన కట్టా సాయిని కప్పలకుంట వద్ద ఆటోలో ఎక్కించుకుని నల్లజర్ల మండలం అయ్యవరంనకు వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఓ కారు అతివేగంగా వెనుక నుంచి వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రభాకరరావుకు తీవ్ర గాయాలు కాగా, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సారా బట్టీల ధ్వంసం

కుక్కునూరు: మండలంలోని సీతారామనగరం గ్రామ శివారులో సారా తయారీ కేంద్రాలపై ఆదివారం కుక్కునూరు సీఐ ఎం రమేష్ బాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని సారా బట్టీలను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. దాడుల్లో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

భీమవరం: భీమవరం ఒకటో పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో వివాహిత యు.శశిపూర్ణిమ (31) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. శశిపూర్ణిమకు ఆరేళ్ల కిందట వివాహం కాగా ఓ పాప ఉందన్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం



ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీవేద

పాలకొల్లు సెంట్రల్: అర్ధరాత్రి నిద్రిస్తున్న భార్యపై భర్త కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని అర్థకట్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాళ్లబండి వెంకటేశ్వర్లు భార్య వెంకటరమణ కొంతకాలంగా కుటుంబ కలహాలతో గొడవపడుతున్నారు. శనివారం కూడా ఇద్దరూ గొడవపడ్డారు. అర్ధరాత్రి సమయంలో భార్య వెంకటరమణ నిద్రిస్తుండగా భర్త వెంకటేశ్వర్లు వచ్చి తలుపు కొట్టాడు. లేచి తలుపు తీయగా ఆమె మెడపై వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వెంటనే వచ్చి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని నరసాపురం డీఎస్పీ శ్రీవేద పర్యవేక్షించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాలకొల్లు రూరల్ ఎస్సై బి సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

న్యాయం చేయండి మహాప్రభో

- ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న రంగబాబు నిరసన
- తన ఆస్తి ఆక్రమ రిజిస్ట్రేషన్‌కు రంగం సిద్ధం చేశారని ఆరోపణ



తన ఆవేదన వ్యక్తం చేస్తున్న రంగబాబు

ఉండి: భూ అక్రమార్కులకు ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారిందంటూ రంగబాబు అనే వ్యక్తి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కొనసాగుతోంది. చినగొల్లపాలెంలో తమ ఆస్తికి సంబంధించి అక్రమాలు జరుగుతున్నాయని, తమ ఆస్తిని అక్రమార్కులకు కట్టబెట్టేలా అక్రమ రిజిస్ట్రేషన్ చేసేందుకు రంగం సిద్ధమైపోయిందని తెలిపారు. అక్రమ డాక్యుమెంట్ తయారు కావడంతో పాటు స్టాంప్ డ్యూటీ కూడా అక్రమార్కులు చెల్లించేశారని చెప్పారు. ఈ క్రమంలో వారం రోజులుగా ఆయన కార్యాలయం వద్ద కారులోనే నివాసం ఉంటూ కాలువలోనే స్నానం చేస్తూ న్యాయం కోసం పోరాడుతున్నారు. శని, ఆది వారాలు సెలవు రోజులైనా ఆయన తన ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు, రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అక్రమార్కులు వస్తారనే సమాచారం ఉండటంతో కంటి మీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నారు. తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తక్షణమే ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి ఉండి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు చేయకపోతే తాను తన కుటుంబంతో ఆత్మహత్య చేసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. సోమ లేదా మంగళవారం నుంచి నిరసన దీక్ష చేపట్టాలనుకుంటున్నానని తెలిపారు.

ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కుక్కునూరు: ఏజెన్సీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీచేయాలని ఎస్ఎఫ్ఐ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొలికపోగు లెనిన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతం అంటే చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రజలు గోదావరి వరదలో కొట్టుకుపోయినా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఉపాధ్యాయులను కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని వాపోయారు. గత 11 ఏళ్లుగా ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న బాబురావు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. ఉపాధ్యాయుల బదిలీ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలో భర్తీ చేయకుండా ఇక్కడి ఉపాధ్యాయులను ఎలా రిలీవ్ చేస్తారని ప్రశ్నించారు. విలీన మండలాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఈనెల 16, 17 తేదీల్లో దీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వై నాగేంద్రరావు, సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లెల చంటినాయుడు, సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే రఘు, కుక్కునూరు మండల అధ్యక్షుడు గజ్జి రాజు తదితరులు పాల్గొన్నారు.

12 మందిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ప్రేమ పెళ్లి వ్యవహారంలో యువకుడి కుటుంబ సభ్యులపై దాడి చేసి యువతిని తీసుకువెళ్లిన ఘటనలో 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎంవీ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన బెజవాడ రమేష్, పెదవేగి మండలం వీరంపాలెంకు చెందిన పుప్పాల గంగోత్రి శుక్రవారం ఏలూరులో ప్రేమ వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి లక్కవరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రక్షణ కావాలని కోరారు. దీంతో ఎస్సై డి.శశాంక ప్రేమజంట ఇరు కుటుంబాలను స్టేషన్‌కు రావాల్సిందిగా సమాచారం ఇచ్చారు. అయితే శనివారం అర్ధరాత్రి యువతి కుటుంబ సభ్యులు రమేష్ ఇంటిపై దాడి చేసి గంగోత్రిని తీసుకువెళ్లిపోయారు. ఈ ఘటనలో కొందరు యువకులను రమేష్ కుటుంబ సభ్యులు పట్టుకుని లక్కవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఆందోళన చేశారు. దీంతో డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ సుభాష్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి యువతిని జంగారెడ్డిగూడెం తీసుకువచ్చారు. దాడికి పాల్పడ యువతి సోదరుడు శరత్‌చంద్రతో పాటు మరో 11 మందిపై ఆదివారం కేసు నమోదు చేశామని, అలాగే ఇరువర్గాలను బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. యువతి గంగోత్రిని భర్త రమేష్‌కు అప్పగించినట్లు చెప్పారు.

పశువుల ప్రాణాలకే ముప్పు

- వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- ముందుగానే టీకాలు వేయించాలంటున్న పశువైద్యులు



పశువులు



గొర్రెలు

పాడి - పంట

బుట్టాయగూడెం: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సంభవించే అవకాశముందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ అధికారులు సూచిస్తున్నారు. పశువులు, గొర్రెలు ఇతరత్రా జీవాలకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే సకాలంలో అందుబాటులో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించి సరైన చికిత్స చేయించాలని సూచిస్తున్నారు. అలాగే ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

బ్లూటంగ్– ఫూట్‌రాట్ లక్షణాలు

గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధులు సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవులు దద్దర్లు, నోటిలోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్లు కుంటడం, ఒంట్లో నీరు చేరడం, పారుకోవడం, మేత మేయకపోవడం, అలాగే ఈసుకుపోవడం (అబార్షన్‌లు) వంటి లక్షణాల వలన 30 శాతం వరకూ మరణాలు సంభవిస్తాయి. వీటి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడూ బ్లూటాక్స్/టిక్కిల్ మందులు పిచికారీ చేస్తూ పోడు ప్రాంతాల్లో మేతకు తీసుకువెళ్లాలి

కాళ్లపుండ్లు వ్యాధి సోకితే

జీవాలకు కాళ్లపుండ్లు వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి చెడువాసన వస్తుంది. అలాగే గొర్రెలు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు జీవాలను బురద ప్రాంతంలో మేపకూడదు. పొడి ప్రాంతంలోనే మేత వేసే విధంగా చూడాలి.

గొంతువాపు వ్యాధి

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రమాదకరం. ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో సూక్ష్మజీవుల వల్ల ఈ వ్యాధి పశువులకు సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీటి ద్వారా, మేత ద్వారా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధుల బారిన పడతాయి. గొంతువాపు వ్యాధి బారిన పడిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన వాటికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఒకేపాకలో మిగతా వాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. అలాగే వర్షాకాలంలో పశువులు వర్షాలకు తడవకుండా చూడాలి.

నివారణ చర్యలు

జూన్, జులై, ఆగష్టు నెలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వ్యాధిసోకిన పశువులను మిగిలినవాటి నుంచి వేరు చేయాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలి.

చిటిక వ్యాధి

ఇది గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. ఎంటరోటాక్సీమియా అనే బ్యాక్టీరియా వల్ల తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఏడాది వయస్సు గల గొర్రెల్లో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధిసోకిన గొర్రెలు నీరసించి కొద్దిసేపటికే గిలగిలా కొట్టుకుని గాలిలో ఎగిరి కిందపడి మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలను ఉదయం, మధ్యాహ్న వేళల్లో గొర్రెల్లో కనిపిస్తాయి. గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరుచేయాలి.

జాగ్రత్తలు అవసరం



వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందుగానే టీకాలు వేయించుకోవడం ఉత్తమం. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే పశుప్రాణాలకు ముప్పు. పశువులకు సోకే వ్యాధులను గుర్తిస్తే దగ్గరలో ఉన్న పశువుల ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. సకాలంలో వైద్యం అందేలా కృషి చేయాలి.

– డాక్టర్. మల్లంపల్లి సాయిబుచ్చారావు, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశుసంవర్థకశాఖ, జీలుగుమిల్లి

క్లుప్తంగా

విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ శాసన సభ్యులు, విలక్షణ నటుడు కోటా శ్రీనివాస రావు అకాల మరణానికి చింతిస్తు బీజేపీ ఆధ్వ ర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. మౌనం పాటించారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, కంచుమర్తి నాగేశ్వరరావు, అయినం బాలకృష్ణ, రామగాని సత్యనారా యణ, గరగ ప్రసాద్, తమురాడ చిన్నా, కంచర్ల రాజా, పచ్చా గోపాలకృష్ణ, అంజి, నీలం రమణ, నాగబుజ్జి, తదితరులు మాట్లాడుతూ కోటా శ్రీనివాసరావు జీవిత విశేషాలను వెల్లడించారు. కోటా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మహంకాళమ్మకు ఆషాఢ మాసం సారె


అమ్మవారికి ఆషాఢ మాసం సారె

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరితోట లోని శ్రీదేవి మహంకాళమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ఆషాఢ మాసం సారె మహిళలచే అందజేశారు. వివిధరకాల పండ్లు, స్వీట్లు, పూలు, చీరలు, పసుపు, కుంకుం, గాజులు అమ్మ వారికి సారెగా ఇచ్చారు. ఆలయ ధర్మకర్త యెగ్గిన నాగబాబు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. విశేష పూజలు జరిగాయి.

ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంఘం అధ్యక్షుడిగా వీర్రాజు


వీర్రాజును సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎరువులు, పురుగుమందుల డీలర్ల సంఘం మం డల అధ్యక్షుడిగా మోదుగ గుంట గ్రామానికి చెందిన సిద్దా వీర్రాజు ఎన్ని కయ్యారు. తాడేప ల్లిగూడెంలో నిర్వ హించిన సమావేశంలో ఈ మేరకు ఎన్నికు న్నట్లు వీర్రాజు ఆదివారం తెలిపారు. ఉపాధ్య క్షునిగా జనార్దన్ గంగరాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని డీలర్లు మద్దుకూరి ధన రాజు, చిక్కాల సత్యనారాయణ, జద్దు హరిబాబు తదితరులు అభినందించారు.

యేలూరి సత్యనారాయణ మూర్తికి సత్కారం


వేగేశ్న ఆనందరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సమాఖ్య సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో ఆర్టీసీ డిపో మేనేజర్గా పనిచేసి పదోన్నతిపై తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికా రిగా బదిలీపై వెళ్లిన యేలూరి సత్యనారాయణ మూర్తికి ఆదివారం సాయంత్రం డిపోలో సత్కారం జరిగింది. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగేశ్న ఆనందరాజు మృతి సమాజానికి లోటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ దాత, వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ వేగేశ్న ఆనందరాజు అకాల మరణం క్షత్రియ సేవా సమాఖ్య సభ్యు లకు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సమాఖ్య తాడేపల్లిగూడెం శాఖ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్కే వర్మ సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక సుబ్బా రావుపేటలోని వర్మ నివాసంలో ఆదివారం సమాఖ్య, ఇతర స్వచ్ఛంద సేవాసంస్థలు ఆధ్వ ర్యంలో ఆనందరాజు సంతాపం సభ జరిగిం ది. రాష్ట్ర గ్రామ ఉద్యోగుల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేగేశ్న భాస్కరరాజు, పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు, ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధి నరసింహారాజు, దాట్ల జగ న్నాథరాజు, గాదిరాజు అచ్యుత రామరాజు, కేవీ భాస్కర్, ఇందుకూరి రమాకాంత్, ఎం.సూ ర్యనారాయణ రాజు, కుచ్చర్లపాలటి వెంకట నరసింహరాజు, సీతారామరాజు తదితరులు సంతాప సభలో పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అమానుషం

పెనుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలు పెరిగిపోయా యని, దాడులు చేయడం అమానుషమని ఆచంట ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ విమర్శించారు. ఆదివారం కొడమం చిలిలో విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్, బీసీ మహిళా నేత ఉప్పాల హారికపై దాడిని ఖండించారు. దాడి చేయడం దుర్మా ర్గపుచర్య అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల మహిళలపై ప్రత్యక్ష, పరోక్ష దాడులు జరుగుతున్నా హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించకపో వడం బాధాకరమన్నారు. ఆచంట నియోజక వర్గం పోడూరు మండలం పండితవిల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రికపై లేనిపోని ఆరోప ణలు చేస్తూ పరోక్ష దాడులకు పాల్పడు తున్నారన్నారు.

హోరెత్తుతున్న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'


అత్తిలిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు


తణుకులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో కరపత్రాలు అందజేస్తున్న ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజేష్

- కూటమి మోసానికి కుంగిపోయామంటున్న ప్రజానీకం
- రూపాయి ఇవ్వకుండా ఏడాది గడిపేశారంటున్న వైనం
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఘన స్వాగతం
- తణుకు నియోజకవర్గంలో చంద్రబాబు మోసంపై రగిలిపోతున్న లబ్ధిదారులు


ఇరగవరంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో మహిళకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్


వేల్పూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో కరపత్రాలు అందజేస్తున్న పార్టీ నాయకులు

తణుకు అర్బన్ : బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. గడపగడపకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులకు చంద్రబాబు హామీలు గుప్పించి మమ్మ ల్ని మోసం చేశారంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్న పరిస్థితులు ఉన్నాయని పార్టీ నాయకులు చెబుతు న్నారు. గత ఐదేళ్లపాటు గడపగడపకు వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తోం దని పార్టీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. పెంచిన వెయ్యి పింఛను, అరకొరగా తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండరు తప్ప మరే ఒక్క పథకాన్ని అమలు చేయలేదంటూ ప్రజానీకం గగ్గోలుపెడుతున్నారు. ఏడాది గడిచిపోయినా సూపర్ సిక్స్ అమలు చేయ లేకపోయారని దుయ్యబడుతున్నారు.

4న జిల్లాలో మొదలు..

ఈనెల 4వ తేదీన భీమవరంలో నిర్వహించిన విస్తృ తస్థాయి సమావేశంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనం తరం తణుకులో ఈనెల 6వ తేదీన మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తణుకులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్య క్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. పార్టీ శ్రేణుల్లో నింపిన జోష్తో 7వ తేదీ నుంచి ప్రతిరోజూ తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో కార్య క్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు.

ఆసక్తికరంగా క్యూఆర్ కోడ్..

బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న పార్టీ శ్రేణులు ప్రతి ఇంటి వద్ద ప్రజలకు క్యూఆర్ కోడ్తో ఉన్న కర పత్రాన్ని అందిస్తున్నారు. ఆ కరపత్రంలో ముద్రించ బడిన క్యూఆర్ కోడ్ను మొబైల్ ద్వారా స్కాన్ చేస్తే కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రకటించిన మ్యానిఫెస్టో కనిపిస్తుంది. దీంతో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీతమ మొబైల్లో కనిపిస్తుండడంతో ప్రజలు తాము నష్టపోయిన పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారు.

చంద్రబాబు చేసిన మోసం ప్రజలకు అర్థమైంది



కూటమి నేతలు ఎన్నికల ముం దు గంపగుత్తగా ఇచ్చిన హామీ లతో అధికారంలోకి వచ్చి ఆ హామీలను అటకెక్కించడంతో తాము మోసపోయామనే విషయం ప్రజలకు అర్థమైంది. పాలిచ్చే ఆవును వదిలేసి వట్టిపోయిన దున్నను చేరదీశామనే పశ్చాత్తాపంలో ప్రజలు ఉన్నారు. పెంచిన వెయ్యి పింఛన్తోపాటు అరకొ రగా తల్లికి వందనం, ఉచిత సిలిండరు తప్ప ఏ పథకం అమలు చేయలేదంటూ ప్రజలు మండిపడు తున్నారు. కూటమి పాలనను వ్యతిరేకించే నోటిని అదుపుచేసేందుకు దాడులు, హత్యలు, మారణ హోమం సృష్టిస్తున్న నేపథ్యంలో ప్రజలు గమ్మగా ఉన్నారు. బాబును వంచన, మోసానికి బ్రాండ్ అం బాసిడర్ అనే మాట యువత నోట వినిపిస్తుంది. నమ్మి మోసపోయామని ప్రజలంతా ముక్త కంఠం తో చెబుతున్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారం టీ కార్యక్రమం ప్రజల్లోకి బాగా వెళ్తుంది. ఇంటి గుమ్మంలోకి వెళ్తున్న పార్టీ శ్రేణులను ప్రజానీకం స్వాగతిస్తున్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

మోసపోయామని ప్రజలు పశ్చాత్తాపంలో ఉన్నారు



కూటమి నేతల హామీలు ఉట్టి మాటలేనని వాస్తవం కాదనే విషయం ప్రజలు గమనించారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ఇంటి గుమ్మంలోకి వెళ్లిన అనుభవంతో బాబు ష్యూరిటీ మోసం గ్యారం టీ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్తున్నాం. బాబును నమ్మి మోసం పోయాం బాబూ అంటూ ప్రజానీకం గగ్గోలుపెడుతున్నారు.

– మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు

చంద్రబాబు, పవన్ మాటల భ్రమలో పడ్డామంటున్నారు



చంద్రబాబు, పవన్ కల్యాణ్ల మాటలు నమ్మి వారి భ్రమలో ఉండి పోయామని, కానీ నేడు వారు చేసిన మోసం గమనించామని ప్రజలు చెబుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా జగన్బాబు ఉంటే ఈ నెలలో ఈ పథకం డబ్బు మాకు వేసేవారని అంటున్నారు. ఇంటికి పెద్ద కొడుకులా ఆదుకున్న జగన్ను కాదని మోసాన్ని, వంచనను నమ్మామని ప్రజా నీకం బాధపడుతున్నారు.

– పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు

నమ్మించి మోసం చేశారు



అమ్మ ఒడికి బదులుగా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఉన్న పిల్లలందరికీ డబ్బు వేస్తామని చెప్పి కొందరికే డబ్బులు వేశారని ప్రజలు చెబుతున్నారు. రైతాంగాన్ని పూర్తిగా వదిలే శారని అన్నదాత సుఖీభవ, ఇన్సూరెన్స్ ఇవ్వకపోగా రెండు నెలలు గడుస్తున్నా తూచిన ధాన్యం తాలూకా డబ్బు జమచేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా ఏ ఒక్కరూ కూడా ఈ ప్రభుత్వంలో సంతోషంగా లేరు.

– కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు

చంద్రబాబు మాటలకు ప్రజలు మోసపోయారు

అత్తిలి: మండలంలోని పాలి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాలింగ్ బాబు మేనిఫెస్టో కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలు ఎంత మోసానికి గురైనారో వివ రిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజ లను కూటమి ప్రభుత్వం అత్యంత దారుణంగా వంచించిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చ లేదని తెలిపారు. ఎక్కడ చూసినా హత్యలు, దాడులు, దౌర్జన్యాలు పరిపాటిగా మారిపో యాయి అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి ప్రజలు పక్షాన్న పోరాడుతుండడం తో కూటమి గుండెల్లో గుబులు మొదలైందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి ప్రసాద్, మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, పార్టీ నాయకులు నల్లమిల్లి శ్రీని వాసరెడ్డి, కేతా రఘురాం, బాలాజీరెడ్డి, హనుమం తరెడ్డి, కంభ సూరిబాబు, కంకటాల సతీష్, కునా ధరాజు శ్రీహరిరాజు, రామిశెట్టి రాము తదిత రులు పాల్గొన్నారు.


పాలి గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటి రీకాలింగ్ బాబు మేనిఫెస్టో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

నీడ నిచ్చే చెట్టును కొట్టేశారు


కొట్టి పడేసిన నీడ నిచ్చే చెట్టు కొమ్మలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం, మొక్కలను నాటండి, చెట్లు పెం చండి అంటూ నినాదాలు ఇవ్వడం మినహా అమలు చేయడంలో వైఫల్యం కానవస్తుంది. విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో నెలకొకసారి, పలు సందర్భాల్లో ఆయా ప్రాంతాలలో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరకడం చేస్తూ ఉంటారు. అంత వరకు బాగానే ఉంది. అయితే ఇటీవల విద్యుత్ సిబ్బంది స్థానిక 9వ వార్డు శాలిపేట కనకదుర్గమ్మ గుడి సర్కిల్ వద్ద విద్యుత్ తీగలకు తగులుతున్న నిద్ర గన్నేరు తరహా చెట్టు కొమ్మలను కొడుతూ అందరికి నీడ నిచ్చే చెట్టును మొదలు వరకు నరికివేశారు. చెట్టుకు ఉన్న అన్ని కొమ్మలు తొలగించారు. తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను మాత్రమే తొలగించలే తప్పా ఈ విధంగా మొదలు వరకు నరకడం ఏమిటి అని అక్కడ వారు విద్యుత్ సిబ్బందిని ప్రశ్నించిన వారు పట్టించుకోలేదని పలువురు చెబుతున్నారు. ఇలా నరికివేస్తే ఎన్నో సంవత్సరాలుగా పెరిగిన చెట్టు తిరిగి బతకదని అంటున్నారు. ఈ విధంగా మరోసారి జరగకుండా చూడాలని వారు కోరుతు న్నారు. అంతేగాక ఎండిన ఆకులు, కొమ్మలు అలానే రోడ్డుపై ఉంచారని, కారులు, ద్విచక్ర వాహనదారులకు పలు ఇబ్బందులు పడుతున్నా రని, పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి చెట్టు వద్ద కొమ్మలు, ఎండిన ఆకులు, ఇతర వ్యర్థాలను తొల గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్లు అమ్మకాల్లో కల్తీ సహించేది లేదు


తణుకు ఎక్సైజ్ కార్యాలయంలో గీత కార్మికులతో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మి

తణుకు అర్బన్: కల్లు అమ్మకాల్లో ఎటువంటి కల్తీలు చేసినా కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై బి.లక్ష్మి హెచ్చరించారు. తణుకు ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం కల్లుగీత కార్మికు లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లా డారు. తెలంగాణ రాష్ట్రంలో కల్తీ కల్లు తాగి అనేక మంది ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఘటనలో స్థానికంగా కూడా అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 29 కల్లుగీత సహకార సంఘాలు, 3 వ్యక్తిగత లైసె న్సులతో కలిపి మొత్తం 32 లైసెన్సులు ఉన్నాయ ని, ఈ సొసైటీలకు సంబంధించి ప్రతి నెల ఆకస్మిక తనిఖీలు చేసి వాటి నుంచి శాంపిల్స్ తీసి రసాయన పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. తీసిన శాంపిల్స్లో ఏదైనా కల్తీ జరిగినట్టు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆ సొసైటీ లైసెన్సును రద్దు చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు. కల్లులో కలిపే ఆల్ప్రాజోలం, డైజీ పామ్, క్లోరల్ హైడ్రేట్ వంటి రసాయనాలు క్రమం గా మానవుడిని వాటికి అలవాటు పడే విధంగా చేయడమే కాకుండా దీర్ఘకాలంలో మానవుడిలో కళ్లు, నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, కాలేయము, జీర్ణ వ్యవస్థ తదితర అవయవాలు మీద తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరించారు. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడి వాంతులు , విరేచనాలు, కంటి చూపు కోల్పోయేందుకు దారితీ స్తుందని అన్నారు. ఎక్కడైనా కల్లు కల్తీ జరుగుతుం దనే అనుమానం వస్తే వెంటనే 9440902436 నం బరులో తమకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

బీవీఆర్ కళాకేంద్రం సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బీవీఆర్ కళాకేం ద్రంలో ఆదివారం రాత్రి కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమా హారం జరిగింది. ఏలూరుకు చెందిన గరగపర్తి శ్రీనివాసరావుచే సన్నాయి మేళా జరిగింది. సభకు అధ్యక్షుడిగా బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించారు. ఆత్మబంధువుల సేవా సం ఘం అధ్యక్షుడు వెజ్జు దుర్గా ప్రసాద్కు గౌరవ పురస్కారం, ఏపీఎస్ ఆర్టీసీలో డిపో మేనేజర్గా పనిచేసిన యేలూరి సత్యనారాయణ మూర్తికి ఉద్యోగ పురస్కారం, నాదస్వర విద్వాంసులు జి.శ్రీనివాసరావుకు కళా పురస్కారం, నటులు దేవిశెట్టి కృష్ణారావుకు ఆర్థిక సత్కారం జరిగాయి. కళాకారులు, సాహితీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉచిత వైద్యం


వృద్ధుడికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్కుమార్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వ ర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్య క్రమంలో భాగంగా ఇంటికే పరిమితమైన వృ ద్ధులకు సీనియర్ వైద్యులు, న్యూరోసైక్రియాటిస్ట్ డాక్టర్ బి.రమేష్కుమార్ వృద్ధులకు వైద్యసేవలు అందించారు. తణుకు, పాలంగి ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా పర్యటించి 5గురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థికసాయంతో ఉచితంగా మందులు అందజేసి నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ వేడుకలను అట్టహాసంగా నిర్వహించండి


మాట్లాడుతున్న ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ఏఆర్కే వర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గోల్డెన్ జూబ్లీ వేడుకలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలో అట్టహాసంగా నిర్వహించాలని యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మనోహర్ కుమార్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సీహెచ్ నరసింహారా జులు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ఏఆర్కే వర్మ అధ్యక్ష తన జరిగింది. రాష్ట్ర సంఘం సర్వసభ్య సమావే శంలో వక్తలు మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుం చి 25వ తేదీ లోపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించాలని, 50వ రాష్ట్ర స్థాయి యోగా స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీ లను పశ్చిమ గోదావరి జిల్లా వేదికగా నిర్వహి స్తామని చెప్పారు. నూతన జిల్లాలలో సంఘం కమిటీలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర కమిటీ ఏక గ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు. రాష్ట్ర కమిటీ నూతన వైస్ చైర్మన్గా నెల్లూరు జిల్లాకు చెందిన వి.ఎస్.సెల్వంను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. రాష్ట్ర సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, కోశాధికారి మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శి చం ద్రశేఖర్, వెంకట్, డాక్టర్ ఎం.రామారావు, 11 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక పన్నులు వసూలు చేస్తే చర్యలు

నరసాపురం: నరసాపురం మున్సిపల్ రోజువారీ మార్కెట్ పన్నులు వసూళ్లకు సంబంధించి కాంట్రా క్టర్ గెజిట్లో ఉన్న రేట్లు ప్రకారం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ బర్రి శ్రీవెంకటర మణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రక టన విడుదల చేశారు. అధిక పన్నులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు గెజిట్ ప్రకారమే పన్నులు ఇచ్చి రశీదు తీసుకోవాలని సూచించారు. పాటదారుడు వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. పాట 9 సార్లు వాయిదా పడ్డాక, తక్కువ మొత్తం రూ.38 లక్షలకు ఖరారు చేశామని పేర్కొన్నారు.

ఇలా వదిలేస్తే ఎలా?

- మండపాకలో పగలంతా వెలిగిన వీధిదీపాలు..


మండపాక రోడ్డులో పగలే వెలుగుతున్న వీధి దీపం


మండపాకలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

తణుకు అర్బన్: తణుకు మండలం మండపాక గ్రామంలో ఆదివారం వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగునిచ్చాయి. ప్రధాన రహదారులు, గ్రామం లో కూడా వీధి దీపాలు వెలుగుతూనే ఉండడంతో ప్రజలు ఇదేమిటి అని ఒక రిని ఒకరు ప్రశ్నించుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదని శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా ఆదివారం రాత్రి వరకు కూడా వెలు గుతూనే ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ఒక పక్క విద్యుత్ బిల్లుల మోత మోగిపోతుంటే అధికారులు ఇలా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పలువురు మండిపడ్డారు.

వైఎస్సార్సీపీలో మహిళలకు సముచిత స్థానం

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు గౌరవం, సముచిత స్థానం కల్పిస్తుందని నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నూతనంగా పదవులు పొందిన మహి ళలు గోపిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.